


నిత్యావసరాలు సామాన్యుడికి అందని ద్రాక్ష!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -100 శనివారం 19 సెప్టెంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## పన్నుల వసూళ్లలో భారీ జోరు..

రూ.12.12 లక్షల కోట్లు దాటిన ఆదాయం!

నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 13 శాతం పెరుగుదల

స్థూల పన్ను వసూళ్లు రూ.14.3 లక్షల కోట్లు

కార్పొరేట్ పన్నులో 19.48 శాతం వృద్ధి

ఎస్‌టీటీ వసూళ్లలో 53 శాతం పెరుగుదల


అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 16.18 శాతం పెరుగుదల

ద్రవ్యలోటు లక్ష్యంలో 26.8 శాతం నమోదు

2లో.



## ‘ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా’



**టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం**

**మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు -ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు**

**ఢిల్లీ : సెప్టెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త);**
పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని **మిగతా 2లో...**

## ‘ఎల్‌నినో’ను ఎదుర్కొనేందుకు చర్యలు

ఈ ఏడాది సాగు 18శాతం తగ్గింది

విద్యుత్తు డిమాండ్‌ను ఎదుర్కొంటాం

‘ఉపాధి’ కోసం కేంద్రం నిధులివ్వాలి: భట్టి

బీఆర్ఎస్ పాలనా వైఫల్యంతోనే

నీటి సంక్షోభం: మంత్రి ఉత్తమ్

తుమ్మిడిహెట్టి సాధనకు కేంద్రంపై ఒత్తిడి

తేవాలని బీజేపీ నాయకులకు పిలుపు

ప్రతి ఫ్యామిలీపై ఎల్‌నినో ఎఫెక్ట్: సీతక్క



# అనర్హత వేటు



**దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్..**



2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు

స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం

కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ

ఏలేటి, కౌశిక్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు

ఖైరతాబాద్ స్థానం ఖాళీగా అయినట్లు స్పష్టీకరణ

బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది, కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు శుక్రవారం హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ పార్టీలో చేరడంతోపాటు కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినట్లు నిరూపితం కావడంతో దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన 23 ఏప్రిల్ 2024 నుంచి ఆయన అనర్హత అమలులోకి వస్తుందని హైకోర్టు ప్రకటించింది. ‘దానం నాగేందర్ పార్టీ మారలేదు ’ అంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ (పదో షెడ్యూల్ ట్రైబ్యునల్) ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌కు పూర్తి విరుద్ధంగా ఉందని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు స్పీకర్ తీర్పును కొట్టేస్తున్నట్లు ప్రకటించింది.మిగతా 2లో...

## ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

**ఏఐ స్కిల్స్ తప్పనిసరి: నారా నారా లోకేశ్**

నిమ్మకూరులో ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీ ఏర్పాటుకు ఆమోదం

10స్కూళ్లను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయం

విద్యార్థులకు ఏఐ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ ల్యాబ్స్ తప్పనిసరి

సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం



**అమరావతి : సెప్టెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలను (ఏపీఆర్ఎస్) ప్రతిభావంతులను తయారుచేసే అత్యుత్తమ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ 59వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ విద్యావ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, “ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు **మిగతా 2లో...**

## అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

విచారణకు హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొన్న వైనం

ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాల్లో నోటీసులు



2లో.

## దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..

**అమరావతి : సెప్టెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్‌లో షిప్‌బిల్డింగ్ రంగానికి భారీ ఊతం లభించనుంది. దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ ఏర్పాటు చేసేందుకు ‘మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్’ (ఎండీఎల్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సచివాలయంలో ఎండీఎల్, ‘నేషనల్ షిప్‌బిల్డింగ్ అండ్ హెవీ ఇండస్ట్రీస్ పార్క్-ఏపీ’ (ఎన్ఎస్‌హెచ్ఐపీ-ఏపీ) మధ్య ఎంవోయూ జరిగింది.**మిగతా 2లో...**



## తెలంగాణకు 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలి

**కేంద్ర మంత్రిచౌహాన్‌ను కోరిన సీఎం రేవంత్**

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకుసహకరించాలనీ విజ్ఞప్తి -ప్రపంచం చూపు.. హైదరాబాద్ వైపు

పెట్టుబడులు, విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలకు కేంద్రంగా నగరం -‘వర్సిటీ’లతో చర్చలు సక్సెస్: సీఎం



**హైదరాబాద్, : సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణకు 9.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కేంద్ర గృహనిర్మాణ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన్ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులతో పాటు కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై కేంద్రమంత్రికి సీఎం వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్తు వినియోగం పెరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రిని సీఎం కోరగా.. కేంద్రం 2 లక్షల ఇళ్లు కేటాయించింది. దీనికి తాజాగా కృతజ్ఞతలు తెలిపిన సీఎం.. డిమాండ్ మేరకు మిగతా ఇళ్లనూ**మిగతా 2లో...**

## 22ఏ భూముల సమస్యలపై హైలెవల్ కమిటీ!

చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్

ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం

భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన

క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి

పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ



**హైదరాబాద్ : సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.**మిగతా 2లో...**

## ప్రతిపక్షమే ప్రభుత్వ టార్గెట్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఫార్ములా ఈ కార్ కేసులో కోర్టుకు హాజరు

అక్టోబర్ 30కి (విచారణ వాయిదా



**హైదరాబాద్ : సెప్టెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త);**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్షాన్ని టార్గెట్ చేయడంపైనే దృష్టి పెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ-కార్ రేసులో శుక్రవారం ఆయన నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి,**మిగతా 2లో...**

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# పన్నుల వసూళ్లలో భారీ జోరు..

**ఢిల్లీ ?సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**

కేంద్ర ప్రభుత్వానికి పన్నుల ఆదాయం భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 17 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 13 శాతం పెరిగి రూ.12.12 లక్షల కోట్లకు చేరాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి.ఇదే సమయంలో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 15 శాతానికి పైగా పెరిగి రూ.14.3 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు 19.48 శాతం పెరిగి సుమారు రూ.5.56 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను, హిందూ అవిభక్త కుటుంబాల (హెచ్‌యూఎఫ్) నుంచి వచ్చిన వసూళ్లు 6 శాతం పెరిగి రూ.6.16 లక్షల కోట్లకు పైగా చేరాయి.సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) వసూళ్లలోనూ భారీ పెరుగుదల కనిపించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 53 శాతం పెరిగి రూ.40,214 కోట్లకు చేరాయి. పన్ను రిఫండ్ల జారీ కూడా 29 శాతానికి పైగా పెరిగి రూ.2.2 లక్షల కోట్లను దాటింది.మరోవైపు సెప్టెంబర్ 17 వరకు అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 16.18 శాతం పెరిగి రూ.5.22 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 18 శాతం పెరిగి రూ.4.16 లక్షల కోట్లుగా, నాన్-కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 9.24 శాతం పెరిగి రూ.1.06 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.ఇక ఏప్రిల్-జూలై మధ్య నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యంలో ఇది 26.8 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ద్రవ్యలోటు రూ.4.7 లక్షల కోట్లు ఉండగా.. ఈసారి కొంత తగ్గింది. 2026-27లో ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

# దుగరాజపట్నంలో భారీ షిప్‌యార్డ్..

**మొదటిపేజీ తరువాయి**

వచ్చే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుపై ఎండీఎల్ సుమారు రూ.15 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 45 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. షిప్‌బిల్డింగ్‌తో పాటు మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సర్వీసులు, అనుబంధ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.ప్రతిపాదిత షిప్‌యార్డ్ ఏటా 12 లక్షల గ్రాస్ టన్నుల నౌకల నిర్మాణ సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. ట్యాంకర్లు, బల్క్ క్యారియర్లు, కంటైనర్ నౌకలు, ఎల్‌ఎన్‌జీ క్యారియర్లు, భారీ ప్రత్యేక నౌకలను ఇక్కడ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో సామర్థ్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంటుంది.దుగరాజపట్నంలో షిప్‌బిల్డింగ్-కమ్-పోర్ట్ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ప్రకారం షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ యార్డ్‌కు సుమారు రూ.29,254 కోట్లు, పోర్టు అభివృద్ధికి రూ.9,513 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

## 22ఏ భూముల సమస్యలపై హైలెవల్ కమిటీ!

**మొదటిపేజీ తరువాయి**

ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు.22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది.ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది.
రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు

**అమరావతి : సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ ఈ నెల 11వ తేదీనే నోటీసులు పంపినట్టు ఈడీ అధికారులు ఆయనకు నేడు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే తనకు నోటీసులు అందలేదని ఈడీ అధికారులకు అంబటి తెలిపారు. దీంతో, విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ ఆయనకు అధికారులు స్పష్టం చేశారు. పలు వివాదాస్పద అంశాలు, చట్టపరమైన కేసుల్లో వార్తల్లో నిలిచిన ఆయనకు, ఈడీ నేరుగా సమన్లు జారీ చేయడం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.గతంలోనే అంబటి రాంబాబుపై పలు పోలీస్ కేసులు నమోదు కావడంతో పాటు, ఆయన సుమారు 18 రోజుల పాటు రిమాండ్‌లో కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభియోగంపై తిరుపతి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి విచారణకు రావాలని ఇటీవల నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి తోడు ఇప్పుడు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాల్లో ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడం గమనార్హం.మరోవైపు, అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు రావడంపై వైసీపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి తమ నేతలపై కుట్రపూరితంగా కేసులు బనాయిస్తోందని ఆరోపిస్తున్నారు.ం

# ప్రతిపక్షమే ప్రభుత్వ టార్గెట్

**మొదటిపేజీ తరువాయి**

స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా హాజరయ్యారు. తదుపరి విచారణను కోర్టు అక్టోబర్ 30కి వాయిదా వేసింది.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్ములా ఈ రేసు హైదరాబాద్, తెలంగాణకు మంచి పేరు తీసుకొచ్చే కార్యక్రమమని చెప్పారున్న. ఎలక్ట్రిక్ వాహన రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగానే రేసును నిర్వహించామని తెలిపారు. పెట్టుబడులు తీసుకొచ్చే ప్రయత్నంపైనా విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ కేసులో ఇప్పటికే రెండుసార్లు కోర్టుకు హాజరయ్యానని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని, ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వాన్ని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ముందుకు ఎన్నికల మ్యానిఫెస్టోను, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు.'కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు కానీ, ఆ రూ.లక్ష కోట్లలో రూ.వెయ్యి కోట్లు మాకు ఇవ్వండి.. మిగిలిన రూ.99 వేల కోట్లతో రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంతో పాటు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చండి' అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించి ఆరోపణలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ 67 ఎకరాల్లోనే ఉందని అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పారని, గతంలో 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ అని చేసిన ఆరోపణల్లో మిగిలిన 933 ఎకరాలు ఎక్కడున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. కేసీఆర్ ఎర్రవల్లిలో 1520 ఏండ్ల కిందట భూములు కొనుగోలు చేశారని, అప్పట్లో ఎకరం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉండేదని తెలిపారు. రూ.లక్ష కోట్ల విలువైన ఆస్తులు కొల్లగొట్టారంటూ చేస్తున్న ఆరోపణలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు.22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో జరుగుతున్న వ్యవహారంపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇతర అంశాలను తెరపైకి తెస్తోందని విమర్శించారు. కేటీఆర్ న్యాయవాది కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేసులో కేటీఆర్ వ్యక్తిగత హాజరు తప్పనిసరి కాకపోయినా కోర్టు గౌరవంతో స్వయంగా ఆయన హాజరైనట్టు తెలిపారు. కాగా, కేసులో ఐదో నిందితుడిగా ఉన్న కంపెనీ ప్రతినిధులకు ఇప్పటివరకు సమన్లు అందలేదు. వారికి ఈ-మెయిల్ ద్వారా సమన్లు జారీ చేయాలని ప్రాసిక్యూషన్ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్ నిర్వహణీయతపై గురువారం కోర్టు రిటర్న్ చేయగా, శుక్రవారం మళ్లీ సమర్పించారు. కంపెనీ ప్రతినిధులకు ఈ-మెయిల్ ద్వారా సమన్లు పంపేందుకు కోర్టు అనుమతిస్తుందా, లేక ప్రత్యక్షంగా సమన్లు ఎలా అందజేయాలన్న దానిపై తదుపరి నిర్ణయం వెలువడాల్సి ఉంది

# 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా'

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. 'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

# దానంపై అనర్హత వేటు

**హైదరాబాద్ : సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ 2026 మార్చి 11న పిటిషన్లను తిరస్కరించిందని పేర్కొన్నారు.స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పీకర్ నిర్ణయంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుంది.దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును తొలుత సెప్టెంబర్ 16న వెలువరించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

# ప్రతిభా కేంద్రాలుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు..

**మొదటిపేజీ తరువాయి**

అకడమిక్ ఎక్సలెన్స్‌పై దృష్టి సారించి, ప్రతిభావంతులను తయారు చేసే కేంద్రాలుగా మారాలి" అని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తొలిసారిగా పత్రికా ప్రకటనల ద్వారా అభినందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటివరకు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన వారిలో 27 మంది ఐఏఎస్‌లు, 20 మంది ఐపీఎస్‌లు, 13 మంది ఐఆర్ఎస్‌లు, నలుగురు ఐఎఫ్ఎస్‌లతో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అధికారులు వివరించగా, మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.

**కీలక నిర్ణయాలు ఇవే..**

టెక్నాలజీలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నైపుణ్య శిక్షణను తప్పనిసరి చేయాలని, అన్ని స్కూళ్లలో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఏపీఆర్ విద్యాసంస్థలను 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇప్పటికే తాడికొండ, కొడిగినహళ్లి పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి.
కృష్ణా జిల్లా నిమ్మకూరులోని ఏపీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ-జేఈఈ/నీట్ అకాడమీని ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరో 6 రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా సమావేశం ఆమోదముద్ర వేసింది.

**సిబ్బంది సంక్షేమం, మౌలిక వసతులపై దృష్టి**

సిబ్బంది సంక్షేమానికి సంబంధించి కూడా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సిబ్బంది పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలిపింది. గెస్ట్ ఫ్యాకల్టీ గౌరవ వేతనాలను ఇతర సొసైటీలతో సమానంగా పెంచడంతో పాటు, పీఈటీలను పీడీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకరించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది నియామకాలకు స్టాఫింగ్ ప్యాటర్న్‌కు ఆమోదం తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో శాశ్వత భవనాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, ఆటోమేటెడ్ స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. విద్యార్థుల వైద్య అత్యవసర పరిస్థితుల కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు చేసే అధికారాన్ని సొసైటీ సెక్రటరీకి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని లోకేశ్ ఆదేశించారు.ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జే. శ్యామలరావు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ రంజిత్ బాషా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఏపీఆర్ఈఐఎస్ కార్యదర్శి కృష్ణమోహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'ఎల్‌నినో'ను ఎదుర్కొనేందుకు చర్యలు

**హైదరాబాద్, : సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాబోయే 11-12 నెలలపాటు తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. పలు ఎత్తిపోతల పథకాల ద్వారా రిజర్వాయర్లు, చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, గ్రామీణ ఉపాధిని అనుసంధానిస్తూ 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రారంభించామని వివరించారు.
అందులో భాగంగా 24 లక్షల ఇంకుడు గుంతలు, 50వేల వ్యవసాయ కుంటలు, 12వేల పర్క్యులేషన్ ట్యాంకులు, 12వేల బోరు బావుల నిర్మాణాలను చేపట్టాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. శుక్రవారం శాసనసభలో ఎల్‌నినో అం శంపై జరిగిన స్వల్పకాలిక చర్చకు భట్టి సమాధానం ఇచ్చారు. తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం గణనీయంగా ఉందని.. వర్షపాతం లోటు, జలాశయాల్లోకి నీటి ప్రవాహం తగ్గడం, వ్యవసాయంపై ఒత్తిడి, విద్యుత్తు డిమాండ్ పెరుగుదల నమోదయ్యాయని తెలిపారు. ఈసారి జూన్‌లో 12 శాతం, జూలైలో ఒక శాతం, ఆగస్టులో ఏకంగా 38 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఆందోళన వ్యక్తం చేశారు.
ఈసారి వానాకాలం సాగువిస్తీర్ణం 123.74 లక్షల ఎకరాలకు చేరిందని.. గత ఏడాది 139.29 లక్షల ఎకరాలతో పోల్చితే 18 శాతం తగ్గిందని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితులతో ఉన్న నీటినే పొదుపుగా వినియోగించేలా చర్య లు చేపట్టామన్నారు. వానల్లేక జలవిద్యుత్తు ఉత్పత్తి కూడా పడిపోయిందని వివరించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పెంచుతూ, థర్మల్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. కరువు పరిస్థితులు ఉన్న సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకానికి కేంద్రం మరింతగా నిధులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



**రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తాం: ఉత్తమ్**

వర్షాభావం ఎంతటి పరీక్ష పెట్టినా రైతాంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందని, ఆకాశం కరుణించకపోయినా అన్నదాత ఆశలు ఎండిపోనివ్వబోమని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శాసనసభలో చెప్పారు. ప్రస్తుత నీటి సంక్షోభం వెనుక ప్రకృతి ప్రతికూలతతో పాటు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగానికి జరిగిన అన్యాయం, అసంపూర్ణ పథకాలు, లోపభూయిష్ట నిర్మాణాలు కారణమని మండిపడ్డారు. రాష్ట్రంలోని చెరువుల్లో 40 శాతం చెరువులు పావువంతు మాత్రమే నిండాయని తెలిపారు.
మిషన్ భగీరథ, తాగునీరు, వేసవి అవసరాలకు నీటిని భద్రపరిచిన తరువాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామని.. ఇందుకోసం ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్‌ను రూపొందిస్తున్నామని తెలిపారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి కేంద్రం చొరవ తీసుకునేలా రాష్ట్ర బీజేపీ నేతలు ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకరించాలని.. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర ప్రతినిధుల బృందాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి కృషి చే యాలన్నారు. ఇక బీజేపీ నాయకులు ఓట్ల కోసం జైశ్రీరాం నినాదాలు చేస్తారని.. వానల కోసం, ప్రజల అవసరాల కోసం పూజలు చేయరని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విమర్శించారు.

**అంతటా ఎల్‌నినో ప్రభావం: మంత్రి సీతక్క**

ఎల్‌నినో కేవలం తెలంగాణ సమస్య కాదని, ప్ర పంచవ్యాప్తంగా ఈ సమస్య ఉందని.. ప్రతి కుటుంబంపై దీని ప్రభావం ఉందని మంత్రి సీతక్క చెప్పా రు. సింగూరు జలాశయంలో 75 రోజులకు సరిపడే జలాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. 4 జిల్లాలు, 2,395 గ్రామాలు, 19 పట్టణ ప్రాంతాలు సింగూరు జలాలపై ఆధారపడి ఉన్నాయన్నారు. అందువల్ల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు, ఉపాధి పనులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు.

**ఉపోద్ఘాతాలు కాదు.. పరిష్కార మార్గాలు చెప్పండి: మహేశ్వర్‌రెడ్డి**

మంత్రులు ఎల్‌నినోపై ఉపోద్ఘాతాలు ఇస్తే ప్రజలకు ఉపయోగం లేదని.. ఆ ప్రభావం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. పరిష్కారాల గురించి మాట్లాడకుండా ఎల్‌నినో చరిత్ర చెబితే ఉపయోగం ఏమిటని నిలదీశారు 27 మందితో నిపుణుల కమిటీ వేసి, ఆ కమిటీ సిఫార్సులతో రూ.802 కోట్లు కేటాయించామని చెబుతున్న ప్రభుత్వం.. ఆ నిధులను ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వానల్లేక చాలా మంది రైతులు బోరుబావులపై ఆధారపడి సాగు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రభుత్వమేమో కరెంటు కోతలు పెడుతోందని విమర్శించారు. సీఎం సొంత ఊరిలోనే రైతులు ధర్నాలు చేస్తున్నారంటే పరిస్థితిని ఎలా ఉందో అర్థమవుతోందన్నారు.

# తెలంగాణకు 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలి

**మొదటిపేజీ తరువాయి**

కేటాయించాలన్నారు. వ్యవసాయ రంగంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.
తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక ఎన్నారై కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌ను ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. అసెంబ్లీలోని చాంబర్‌లో సీఎంను కలిసిన అద్దంకి దయాకర్, ఝాన్సీరెడ్డిలు ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. విదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ పౌరుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ఎన్నారై కమిషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు.
విదేశాల్లో ఉంటూ తెలంగాణ పురోభివృద్ధికి సహకరిస్తున్న ఎన్నారైలు.. ఈ రాష్ట్రంలో వారి ఆస్తులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించునే విషయంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారని సీఎం దృష్టికి తెచ్చారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో తక్షణ మార్గదర్శకత్వం, సమన్వయం అందించడం, విదేశీ తెలంగాణ సంస్థలకు-రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు మధ్య బలమైన అనుసంధానాన్ని ఏర్పాటు చేయడం ఇందులో భాగమని పేర్కొన్నారు.

# రామిరెడ్డికి నివాళులర్పించిన నూతి సత్యనారాయణ

## పార్టీకి, కుటుంబానికి తీరని లోటు కాంగ్రెస్ నాయకులు



**తల్లాడ/డిసెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గువ్వల రామిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రామిరెడ్డి పార్థివదేహానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామిరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవింద శ్రీనివాసరావు, కార్యదర్శి మర్శకట్ల బాబు, వైరా మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. రామిరెడ్డి మృతి పార్టీకి, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. తల్లాడ మండలం క్రమశిక్షణ కలిగిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడిని కోల్పోయిందన్నారు. రామిరెడ్డి కుమారుడు పురుషోత్తంరెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బాటలో తుర్కుయే!

**రెసిడెన్షియల్ విద్యావిధానానికి విదేశీ ప్రతినిధుల కితాబు -ధర్మసాగర్ కేజీబీవీని సందర్శించి అధ్యయనం**






**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోసెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో అమలవుతున్న రెసిడెన్షియల్ విద్యావిధానం విదేశీ ప్రతినిధులను ఆకట్టుకుంది. భారత విద్యారంగాన్ని పరిశీలించేందుకు వచ్చిన తుర్కుయే దేశ ప్రతినిధులు మసూద్ ఓనర్, నూరుల్లా శుక్రవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)ను సందర్శించారు. తెలంగాణలోని రెసిడెన్షియల్ విద్యావిధానం ప్రపంచానికే ఆదర్శంగా ఉందని వారు ప్రశంసించారు.

పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని పరిశీలించిన ప్రతినిధులు.. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా తెలుసుకున్నారు. సీనియర్ ఇంటర్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు, కేజీబీవీ ఎస్ఓ మాధవితో మాట్లాడి బోధనా పద్ధతులు, విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలపై వివరాలు సేకరించారు.

**తమ దేశంలోనూ అమలు చేస్తాం..**

తెలంగాణ రెసిడెన్షియల్ విధానం విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడంతోపాటు అవసరమైన సౌకర్యాలను కల్పించడం విశేషమని తుర్కుయే ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ విధానాన్ని తమ దేశంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు డీఈఓ ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, జీసీడీఓ సునీత, ఎంఈఓ శ్రీదేవి రాష్ట్రంలో అమలవుతున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠశాల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ తదితర పథకాల వివరాలను ప్రతినిధులకు వివరించారు.

కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు అశ్వినీకుమార్, ప్రధాన కార్యదర్శి సి.ఎల్. రోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్, టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రతినిధులు చిత్తలూరి ప్రసాద్, త్రివేణి, విజయలక్ష్మి, గీత, పాలిటెక్నిక్ అధ్యాపకురాలు రజితారెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్షుడు ఫలిత శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, మహబూబాబాద్ అధ్యక్షుడు మిర్యాల సతీష్, ధర్మసాగర్ మండల అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జాన్‌సింగ్, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం మహోన్నత సేవా కార్యక్రమం

## గుండ్ల సింగారంలో మహా అన్నదానం






**హనుమకొండ/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** అన్నదానం మహోన్నతమైన సేవా కార్యక్రమమని సీపీఐ మండల కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్ అన్నారు. శుక్రవారం గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద తురక శోభన్ కుటుంబం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టాలిన్‌తో పాటు సీపీఐ మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పొనుగోటి రాముగోపాల్‌చారి, మామునూరి దామోదర్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం పుణ్యకార్యమని అన్నారు. సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అన్నదాన దాత తురక శోభన్‌ను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో గుంటి రజిత, తోట రామారావు, ఐదులపురం ప్రదీప్, లక్కం రాజు, రాపాల తిరుపతి, కళ్లేపల్లి రాజు, పట్టేం సరోజన, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బస్సులు తగ్గిస్తే ప్రయాణికుల గతి ఏంటి?

## నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు జనసేన నేత శివకోటి యాదవ్ వినతి

**నర్సంపేట/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట ఆర్టీసీ డిపో నుంచి వివిధ మార్గాల్లో తగ్గించిన బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని జనసేన నియోజకవర్గ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిపో మేనేజర్ సరస్వతిని కలిసి వినతిపత్రం అందజేశారు. నర్సంపేట నుంచి నిజామాబాద్‌కు గతంలో 15 నుంచి 17 బస్సు సర్వీసులు ఉండగా తగ్గించారని, శ్రీశైలం, భద్రాచలం, ఆదిలాబాద్ తదితర మార్గాల్లోనూ సర్వీసులు తగ్గడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని శివకోటి యాదవ్ తెలిపారు. మరోవైపు ఉద్యోగుల పదవీ విరమణ, ఇతర డిపోలకు బదిలీలతో




సిబ్బంది కొరత ఏర్పడిందన్నారు. సమస్యపై డిపో మేనేజర్ సరస్వతి స్పందిస్తూ.. కొన్ని మార్గాల్లో సర్వీసులు తగ్గించిన మాట వాస్తవమేనని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా నర్సంపేట-వరంగల్ మార్గంలో ప్రత్యామ్నాయ సర్వీసులు పెంచినట్లు వివరించారని శివకోటి యాదవ్ తెలిపారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు కొత్త సిబ్బందిని తీసుకుంటున్నట్లు మేనేజర్ చెప్పారన్నారు.

ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సర్వీసులు నడపాలి. ప్రజలకు అసౌకర్యం కలిగితే సమస్యను మరింత తీవ్రంగా లేవనెత్తాల్సి వస్తుందని శివకోటి యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎలబోయిన డేవిడ్, రోడ్డ శ్రీకాంత్, టేకుల రవి, బోడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# నాయిని చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**జమ్మికుంట/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** జమ్మికుంట పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నాయిని చెరువు వద్ద చేపట్టనున్న గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ అలాం పరిశీలించారు. నిమజ్జనం సురక్షితంగా, వేగంగా జరిగేలా మూడు క్రేన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి, ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ గౌడ్, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రాంతంలో భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పోలీసు, ప్రభుత్వ సూచనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని కోరారు.

# ఘనంగా ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

**జమ్మికుంట/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ జన్మదిన వేడుకలను జమ్మికుంట గాంధీ చౌరస్తాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు మద్దూర్ శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎక్కిటి సంజీవరెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆరె రమేష్‌రెడ్డి, జర్నలిస్టు ఉద్యమకారుడు రచ్చ గణేష్ తదితరులు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం పరస్పరం మిఠాయిలు పంచుకుని రాష్ట్ర అధ్యక్షుడికి ఆయురారోగ్యాలు, మరెన్నో విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు డాక్టర్ చీమ శ్రీనివాస్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పాతకాల ఓదెలు, ఉపాధ్యక్షులు రామ్ రాజబాబు, కొంగరి రవీందర్, బిట్ల రమేష్, బిట్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలి

**-ఎమ్మెల్యే మురళి నాయక్**

**జీఓ 58 కింద స్థలాలకు హక్కులు కల్పించాలని అసెంబ్లీలో విజ్ఞప్తి**



**మహబూబాబాద్/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జీఓ 58 కింద 50 నుంచి 70 గజాల స్థలాల్లో ఇళు నిర్మించుకుని నివసిస్తున్న నిరుపేదల ఇళ్లను క్రమబద్ధీకరించి హక్కులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 1,600 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, చిన్నచిన్న స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు.

1,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి: మహబూబాబాద్‌కు 1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రిని కోరారు. కొత్తబజార్‌కు 500, మున్సిపాలిటీలోని ఇతర ప్రాంతాలకు 1,000 ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

అటవీ శాఖ అడ్డంకులు తొలగించాలి: ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటవీ శాఖ నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించి అర్హులైన పేదలకు ఇబ్బందులు లేకుండా ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ భవనాలకు అదనపు నిధులు: గతంలో గ్రామానికి రూ.12 లక్షలు కేటాయించినా నిధులు సరిపోక అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాలకు అదనపు నిధులు మంజూరు చేసి వెంటనే అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే కోరారు.

# డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలి




**ఖమ్మం/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** ప్రజలకు సంబంధించిన లక్షలాది ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితాలో ఎందుకు చేర్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని టీడీపీ నాయకుడు మల్లెంపాటి అప్పారావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యపై సమాధానం చెప్పకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. 22-ఏ జాబితాలో అక్రమంగా చేర్చిన రైతుల భూములను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ అధికారులతో కాకుండా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల భూముల సమస్యపై బీజేపీ కూడా స్పష్టమైన వైఖరి ప్రకటించాలని అన్నారు. సమావేశంలో పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్, గడిపూడి వెంకటేశ్వర్లు, కర్నాటి అశ్వనికుమార్, రాయల కోటేశ్వరరావు, కామినేని శ్రీనివాసరావు, పెమ్మసాని హరీష్, పరిటాల నాగార్జున, మల్లెంపాటి లహరిన్, వల్లోజి రాము తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో అలరించిన విశ్వశాంతి విద్యార్థుల నృత్యాలు

**విద్యార్థులను అభినందించిన సండ్ర వెంకటవీరయ్య, మువ్వా విజయబాబు**







**సత్తుపల్లి/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లి పట్టణ శివారులోని ప్రసన్న గణపతి ఆలయంలో విశ్వశాంతి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు భక్తులను, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వినాయకుడి వైభవం, భక్తిభావం ప్రతిబింబించేలా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో భక్తి, గణపతి నృత్యాలను ప్రదర్శించారు. వారి అభినయం, నృత్య నైపుణ్యానికి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు విద్యార్థులను అభినందించారు. నృత్య శిక్షణ అందించిన కోలాట బృందం కళాకారులు తడికమళ్ల నరేష్ తదితరులను కూడా ప్రశంసించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



**ఖమ్మం/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. రైతాంగ సమస్యలు, సంక్షేమ పథకాలు, సాగునీరు, మౌలిక వసతుల అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటించాలని, అనధికారిక జాబితాలను రద్దు చేసి గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని కోరారు. తల్లాడ మండలం సిరిపురం మేజర్ కాలువ ఆధునికీకరణ పనులను వేగవంతం చేసి సుమారు 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. పెనుబల్లి మండలంలోని రాతోని, తాళ్లపెంట ఎత్తిపోతల పథకాల పరిధిలో దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. రఘునాథపాలెం మండలం జింకలతండాలో ఈద్గా, ఖబరస్థాన్‌కు స్థలం కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఆయిల్‌పామ్ రైతులకు ధర భరోసా కల్పించాలి

**ఎఫ్ఎఫ్‌బీ టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర ఇవ్వాలి**

**కేంద్ర మంత్రికి రైతుల సంఘం వినతి**



**అశ్వారావుపేట/సెప్టెంబరు 18 (జర్నలిస్ట్ వార్త):** ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, పంటపై భరోసా పెంచాలని తెలంగాణ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఎఫ్ఎఫ్‌బీకి టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర అమలు చేయాలని సంఘం అధ్యక్షుడు అలపాటి రామచంద్ర ప్రసాద్ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. దాని ప్రతిని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు. ఎరువులు, కూలీలు, రవాణా ఖర్చులు పెరగడంతో ఆయిల్‌పామ్ సాగు వ్యయం భారమైందని రామచంద్ర ప్రసాద్ తెలిపారు. ఎఫ్ఎఫ్‌బీ ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతులకు లాభదాయక ధర లభించాలంటే ముడి పామాయిల్ ధర టన్నుకు సుమారు రూ.1.40 లక్షల స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించడంతోపాటు రైతుల్లో పంటపై నమ్మకం పెంచేందుకు ఎఫ్ఎఫ్‌బీకి టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర అమలు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీఐ దరఖాస్తులపై అనుమానాలు

## సమాచారం పేరుతో ఒత్తిళ్ల ఆరోపణలు.. విచారణకు డిమాండ్


**జమ్మికుంట/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ను కొందరు వ్యక్తులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు జమ్మికుంటలో చర్చనీయాంశంగా మారాయి. సామాజిక కార్యకర్తలుగా పరిచయం చేసుకుంటూ కొన్ని వ్యాపార సంస్థలు, నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని వరుసగా సమాచార అభ్యర్థనలు, ఫిర్యాదులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సమాచారం వేగంగా ఎలా?**

సాధారణ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం కోసం పలుమార్లు తిరగాల్సి వస్తుండగా, కొందరు వ్యక్తులకు మాత్రం సంబంధిత అంశాలపై సమాచారం త్వరగా అందుబాటులోకి వస్తోందన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల నుంచి సమాచారం ఎలా లభిస్తోంది? ఇందులో అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వీటిపై ఎలాంటి నిర్ధారణ లేకపోవడంతో సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

**వ్యాపార వర్గాల్లో ఆందోళన**

ఆర్టీఐ దరఖాస్తులు, ఫిర్యాదులు, నోటీసుల పేరుతో తమపై ఒత్తిడి పెరుగుతోందని కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే ఆర్టీఐ ద్వారా ప్రభుత్వ సమాచారాన్ని కోరడం చట్టబద్ధమైన హక్కు. అదే సమయంలో ఆ హక్కును వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారనే




ఆరోపణలు నిజమైతే వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**వాస్తవాలు వెలుగులోకి రావాలి**

ఆర్టీఐ దరఖాస్తులను అడ్డుపెట్టుకుని ఎవరైనా వ్యక్తిగతంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు ఉంటే సంబంధిత అధికారులు ఆధారాలతో విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అలాగే అధికారుల నుంచి సమాచారం లీక్ అవుతోందనే ఆరోపణలు ఉంటే వాటిపైనా శాఖాపరంగా పరిశీలన జరపాలని అంటున్నారు. ఆర్టీఐ చట్టం ఉద్దేశాన్ని కాపాడుతూ, దాని పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలకు కూడా చట్టబద్ధంగా తెరదించాలని కోరుతున్నారు.

# పోషణపై అవగాహనకు పెద్దపీట

## జాతీయ పోషణ మాసోత్సవం




**నర్సంపేట/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణంలోని రైతువేదికలో జాతీయ పోషణ మాసోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సీడీపీఓ మధురిమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, పౌష్టికాహార వంటకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆమె తిలకించారు. ఈ సందర్భంగా లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ.. తల్లులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పిల్లలకు పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో అంగన్వాడీ కేంద్రాల సేవలు కీలకమన్నారు. సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ.. 'మన అంగన్వాడీమన బాధ్యత' నినాదంతో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పూర్వకాలపు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణులకు శ్రీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. కూరగాయలతో రూపొందించిన వినాయకుడు, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన పూర్ణకుంభం ఆకట్టుకున్నాయి. పోషణ, పూర్వ ప్రాథమిక విద్యపై చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, అంగన్వాడీ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

# నిత్యావసరాలు సామాన్యుడికి అందని ద్రాక్ష!

## ధరల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ ఏదీ? -పెంచినప్పుడు పెంచేస్తారు.. తగ్గినా తగ్గించరా?

**సత్తుపల్లి/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి నియోజకవర్గంలో నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోనూ ధరల నియంత్రణ కొరవడిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం తినే టిఫిన్ నుంచి వేసవిలో తాగే కొబ్బరి నీళ్ల వరకు ఏది కొనాలన్నా ధరలు చూసి సామాన్యుడు గుండె గుభేల్‌మంటున్న పరిస్థితి నెలకొంది.

**ధర పెరిగితే పదిరెట్లు భారం?**

ప్రభుత్వం ఏదైనా వస్తువు ధరను స్వల్పంగా పెంచితే స్థానిక మార్కెట్‌లో మాత్రం అంతకుమించి ధరలు పెంచి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు మార్కెట్‌లో సరుకుల ధరలు తగ్గినా కొందరు వ్యాపారులు మాత్రం గతంలో పెంచిన ధరలనే కొనసాగిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుతున్నాయి.

**కొబ్బరి నీళ్లు.టిఫిన్ ధరలూ పైపైకే**

ఒకప్పుడు లీటర్ కొబ్బరి నీళ్లు సుమారు రూ.80కు లభించేవని, ప్రస్తుతం రూ.120 వరకు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అలాగే గతంలో సుమారు రూ.1520 మధ్య లభించిన టిఫిన్ ప్లేట్ ధరలు ప్రస్తుతం గణనీయంగా పెరిగాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. పూరీ, ఇడ్లీ, దోశ ఏది తిన్నా జేబుకు చిల్లు పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాభావ పరిస్థితులు, పంటల దిగుబడి తగ్గడం వంటి కారణాలతో కొంతమేర ధరలు పెరగడం సహజమే అయినప్పటికీ, వాటిని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



**తోపుడు బండ్ల వెనుక కిరాయి దందా?**

షాపుల ముందు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకునే వారి నుంచి కొందరు దుకాణ యజమానులు నెలకు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు కిరాయి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాము భారీగా కిరాయి చెల్లించాల్సి వస్తోందని, సరుకుల ధరలు కూడా పెరిగాయని, అందువల్ల ధరలు తగ్గించడం సాధ్యం కాదని కొందరు తోపుడు బండ్ల నిర్వాహకులు చెబుతున్నట్లు సమాచారం.

దుకాణాల అద్దెలు, ఇతర ఖర్చుల భారం చివరకు వినియోగదారుడిపైనే పడుతోందని ప్రజలు అంటున్నారు.

**ధరల దోపిడీని ప్రశ్నిస్తే ఆగ్రహం**

ధరల పెరుగుదలపై ప్రశ్నిస్తున్న విలేకరులపైనా కొందరు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వార్తలు రాస్తే శాపనార్థాలు పెడుతున్నారని, ఒకసారి ధర నిర్ణయించిన తర్వాత మార్కెట్‌లో ధరలు తగ్గినా తాము తగ్గించేది లేదన్న ధోరణిలో కొందరు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏదీ?**

ధరలు పెరిగినప్పుడు వెంటనే పెంచుతున్న వ్యాపారులు. మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు ఎందుకు తగ్గించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతమేర తనిఖీలు నిర్వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అంతంతమాత్రపు ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెరుగుతున్న ధరల భారం మరింత పెరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధిక ధరలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకుని సామాన్యుడికి ఉపశమనం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# భూ అక్రమాలపై బహిరంగ విచారణ జరపాలి

## కాంగ్రెస్ నేతల డిమాండ్



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం, వారి బినామీలు భూ అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో బహిరంగ విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగట్టు దేవస్థానం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలు అన్నారని, బీఆర్ఎస్ హయాంలో 'భూములు, కబ్జాలు, దోపిడీలు' జరిగాయని ఆరోపించారు. ధరణిలో జరిగిన అక్రమ భూ బదలాయింపులపై విచారణ జరిపి, అక్రమంగా పట్టాలు చేసినట్లు తేలితే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో చేర్చి, ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్‌కుమార్, తంగేళ్లపల్లి తిరుపతి, నేదునూరి సునీల్, గొర్రె కిరణ్‌కుమార్, చిర రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్ట రాజమ్మకు మందకృష్ణ మాదిగ నివాళి



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండలం సుబ్బాయిపల్లె గ్రామానికి చెందిన పుట్ట రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.పుట్ట రాజమ్మ.. ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు, ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ తల్లి.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ నాయకుడు జంగా రాఘవరెడ్డి, సహకార సంఘం చైర్మన్ బిల్లా ఉదయరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరి, తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, బొడ్డు దయాకర్ మాదిగ, కొయ్యడ మల్లేష్ మాదిగ, కందికట్ల విజయ్ మాదిగ, బండారు సురేందర్ మాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, రాజారపు బిక్షపతి మాదిగ, బిర్రు మహేందర్ మాదిగ, రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ, ఆరేపల్లి పవన్ మాదిగ, మేకల రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఆరేపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం

## మన అంగన్వాడిమన బాధ్యత.. గ్రామ సర్పంచ్ స్రవంతిరాజు




**ఎల్కతుర్తి/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం ఆరేపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ కరుణ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పోతారబోయిన స్రవంతిరాజు, ఉపసర్పంచ్ ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ స్రవంతిరాజు మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే శ్రేష్ఠమైన ఆహారమని, శిశువులకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రం ద్వారా అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బడి ఈడు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో నమోదు చేయించి, విద్యకు సిద్ధం చేయాలని సూచించారు.పిల్లల ఆరోగ్యం, పోషణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, 'మన అంగన్వాడిమన బాధ్యత' అనే భావనతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ కరుణ, ఆయా, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుపాడులో భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి వేడుకలు

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు



**తల్లాడ/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఎన్నిక కృష్ణవేణి, జక్కంపూడి కిషోర్, ఎన్నిక నరసరావు, జక్కంపూడి రమేష్ తదితరులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సాయికుమార్, నాగుల మీరా, మహిళలు, భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# గొట్టం దామోదర్‌కు డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు నివాళి



**కేసముద్రం/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీ 1వ వార్డుకు చెందిన గొట్టం దామోదర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్, ధన్నసరి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ డాక్టర్ అల్లం రమ-నాగేశ్వర్ రావు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.డి. అయూబ్ ఖాన్, 3వ వార్డు కౌన్సిలర్ ధారావత్ కిషోర్, మాజీ ఉపసర్పంచ్ రఫీ, తరాల సుధాకర్, ఎం.డి. రషీద్ ఖాన్, ముజ్జు షేక్, రాజేష్, జెల్లెంపల్లి శ్రీను, వినోద్ రాజ్‌తో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్నారుగూడెంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**తల్లాడ/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):**
వినాయక చవితి ఉత్సవాలు తల్లాడ మండలం అన్నారుగూడెంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గ్రామ మాజీ సర్పంచ్ మారెళ్ల మమతమల్లికార్జునరావు దంపతులు పీటలపై కూర్చుని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గణేశుడికి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ సత్యవతి, తాళ్ల జోసెఫ్, ఆలయ కమిటీ సభ్యులు మల్లిడి వెంకటయ్య, నున్నా సాందీప్, పాపినేని మధు, దుగ్గిన్ని గోపయ్య, ఆపతి రామారావుతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా పోటీలకు 144 మంది క్రీడాకారుల ఎంపిక



**హసన్‌పర్తి/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండల స్థాయి 70వ ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు శుక్రవారం జెడ్పీహెచ్‌ఎస్ హసన్‌పర్తిలో ఘనంగా ముగిశాయి. మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శారద ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు.

మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 144 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రాతినిధ్యం వహించనున్నారు.

కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల హెచ్‌ఎం ఎం.విజయలక్ష్మి, హెచ్‌ఎం ఈ.సుమాదేవి, పెగడపల్లి హెచ్‌ఎం డి.శోభారాణి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసుదేవరావు, జిల్లా అండర్-19 కార్యదర్శి శ్రీధర్, అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, టీజీపీఈటీ ఏ పార్థసారథి, పీడీలు బాలమురళీకృష్ణ, నవీన్, శ్రీలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**కేసముద్రం/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీ 13వ వార్డులో శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్నసరి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత-వెంకన్న, వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ, డీటీఏ సభ్యుడు రావుల మురళి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం నాగనబోయిన వెంకటేశ్వర్లు-సునీత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ సిద్ధి వినాయక యూత్ సభ్యులను వారు అభినందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, భక్తులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# యూపీఐ చార్జీలు ఉపసంహరించాలి

## కేసముద్రంలో సీపీఐ నిరసన




**కేసముద్రం/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** యూపీఐ చెల్లింపులపై చార్జీలు విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసముద్రం మున్సిపల్ కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా సీపీఐ మండల నాయకుడు మంద భాస్కర్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై యూపీఐ చార్జీల భారం మోపడం సరికాదన్నారు. యూపీఐ సేవలను మునుపటిలాగే ఉచితంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జన్ను రాజేందర్, నల్గొండ వెంకన్న, ఎస్.కే. మౌలానా, ఎస్.కే. జిలాని, ఉప్పలయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా నాలుగు మంచాల వితరణ



**మధిర/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** మధిర మున్సిపాలిటీ పరిధిలోని సుశీల డిగ్రీ కళాశాల రోడ్డులో ఉన్న ఆదరణ సేవా ఫౌండేషన్‌లో బోనగిరి నారాయణరావు సతీమణి వనజ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. కుమారులు, కోడళ్లు సాయికృష్ణసౌజన్య, జయకృష్ణప్రతిమలతో కలిసి వృద్ధులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి పండ్లు పంపిణీ చేసి, నాలుగు మంచాలను వితరణ చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి, నారాయణరావువనజ దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వనజకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# ఆడబిడ్డల చదువుకు సైకిళ్ల తోడ్పాటు




**కేసముద్రం/సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ ప్రాంత విద్యార్థినుల చదువుకు రవాణా ఇబ్బందులు లేకుండా ఉచిత సైకిళ్లు అందించడం అభినందనీయమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. కేసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గెయిల్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో కేసముద్రం స్టేషన్, కేసముద్రం విలేజ్, ఉప్పరపల్లి పాఠశాలల్లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఆయన సైకిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ సొంత ప్రాంతంలోని ఆడబిడ్డలకు తన చేతుల మీదుగా సైకిళ్లు అందించడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సైకిళ్లను సమకూర్చిన గెయిల్ ఇండియా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గెయిల్ ఇండియా అధికారులు ఆర్.ఎస్. వీర్ మురుగన్, కటియార్, ఆసిఫ్ ఎ. అన్సారీ, దేవ్ కాంత్, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ప్రతినిధి లక్ష్మి, తహసీల్దార్ జి. వివేక్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతికిరణ్, ఎంఈఓ కాలేరు యాదగిరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ నేతల విమర్శలు





**వర్ధన్నపేట/సెప్టెంబరు 18 (జర్నలిస్ట్ వార్త):**
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దళితులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు ప్రభుత్వ, దళిత, ఈనాం భూములపై వచ్చిన ఆరోపణలపై రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు ప్రభుత్వ, దళిత, ఈనాం భూములు అక్రమంగా పట్టాలైనట్లు ఆరోపణలు ఉన్నాయని, వాటిపై రికార్డుల ఆధారంగా విచారణ జరిపించాలని కోరారు వర్ధన్నపేటలో ల్యాండ్ పూలింగ్ పేరుతో దళితుల భూములకు నష్టం



జరిగిందన్న ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు
మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అక్రమంగా పట్టాలైనట్లు ఆరోపణలు ఉన్నాయని, వాటికి రైతుబంధు నిధులు వెళ్లిన అంశంపైనా విచారణ జరపాలన్నారు ప్రభుత్వ భూమిగా తేలితే స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారుటౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల ఉద్యమాలు, బలిదానాల ఫలితంగా ఏర్పడిందన్నారు భూములకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారుఅంబేద్కర్‌నగర్ సర్పంచ్ చీటూరి రాజు మాట్లాడుతూ దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, ప్రతి దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తామని గతంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు దళితుల భూములపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరారుసమావేశంలో సర్పంచులు బట్టిని దశరథం, దుబ్బ అంజయ్య, రజాక్, కాంగ్రెస్ నాయకులు సిందం లక్ష్మీనారాయణ, ఎండీ సోహెల్, కొండేటి సుధాకర్, విలాసరపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# బస్సు - లారీ ఢీ

## : ఒకరికి తీవ్ర గాయాలు.





**బయ్యారం/,సెప్టెంబర్ 18.(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలం ఆలిగేరు బ్రిడ్జి సమీపంలో సత్యనారాయణపురం గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం బస్సు,లారీ ఢీకొన్నాయి.ఈ రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎమ్‌టీ సాయిచంద్,పైలట్ అశోక్‌లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన క్షతగాత్రునికి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్సు సిబ్బంది తెలిపారు.

# శిశు ఆహార ఉత్పత్తుల వివాదం..

## నెస్లే ఇండియాకు చిక్కులు

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
ప్రముఖ ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియాకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గట్టి షాక్ ఇచ్చింది. శిశువులకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల విషయంలో నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను నెస్లే ఇండియాపై చట్టపరమైన చర్యలను ప్రారంభించింది.నాన్ ఎక్సెలియా ప్రో స్టేజ్ 1, లాక్టోజెన్ ప్రో 1 వంటి శిశు ఆహార ఉత్పత్తులకు సంబంధించి నెస్లే ఇండియా ఆన్‌లైన్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రచార సామగ్రిని ఉంచినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించింది. 'నాన్ ఎక్సెలియా ప్రోలో 5 ఎమీలు, వే ప్రోటీన్ ఉన్నాయి', 'లాక్టోజెన్ ప్రోలో సులభంగా జీర్ణమయ్యే వే ప్రోటీన్ ఉంది' వంటి క్లెయిమ్‌లతో ప్రచారం చేయడంపై ఎఫ్ఎస్-ఎస్ఏఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్స్ 2020తో పాటు 1992 నాటి చట్టం ప్రకారం, శిశు ఆహార ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించే ఇటువంటి ప్రకటనలు పూర్తిగా నిషిద్ధం.దీంతో పాటు, నెస్లే ఫార్ములా ఉత్పత్తుల్లో బయోటిన్ స్థాయిలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ తన తనిఖీల్లో కనుగొంది. ఈ ఉల్లంఘనలపై కంపెనీ నుంచి వివరణ కోరగా, సంస్థ సమర్పించిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ మూడు వేర్వేరు అడ్జుడికేషన్ కేసులు నమోదు చేసింది.
ఈ వార్తల నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో నెస్లే ఇండియా షేర్లు సుమారు 2 శాతం వరకు నష్టపోయి, రూ. 1,345 వద్ద ట్రేడ్ అయ్యాయి. శిశు పోషకాహార ఉత్పత్తులకు సంబంధించిన నియమ నిబంధనలను పాటించడంలో కంపెనీ విఫలమైందని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది.

# ఆంక్షలు అమెరికాకు వర్తించవా మరి?

## రష్యా నుంచి యురేనియం కొనుగోలు చేస్తున్న అగ్రరాజ్యం!

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించేలా అమెరికా కొత్త చట్టానికి మార్గం సుగమం చేసింది. 'లిండ్సే ఓ.గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్-2026'కు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. దీంతో రష్యా ఇంధనం కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు టారిఫ్ విధించే అధికారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దక్కనుంది. అయితే ఇది ఆటోమేటిక్‌గా అమలయ్యే టారిఫ్ కాదు. ట్రంప్ ఆ అధికారాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది.
ఇదే సమయంలో రష్యా నుంచి వచ్చే అణు ఇంధనంపై మాత్రం అమెరికా పూర్తిగా తలుపులు మూయలేదు. ముఖ్యంగా రష్యా నుంచి లభించే తక్కువ సాంద్రత యురేనియం (హాజుఖ) విషయంలో పరిమిత మినహాయింపులు కొనసాగుతున్నాయి. అమెరికా అణు విద్యుత్ రంగానికి రష్యా ఇంధన సరఫరా ఇప్పటికీ కీలకంగా ఉండటమే దీనికి ప్రధాన



కారణం.
2024లో అమెరికా రష్యన్ యురేనియం దిగుమతులపై ఆంక్షలు విధించింది. అయితే దేశీయ అణు రియాక్టర్లకు ప్రత్యామ్నాయం దొరకని పరిస్థితుల్లో లేదా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే దిగుమతులకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంచింది. ఈ మినహాయింపులు 2028 జనవరి 1 వరకు మాత్రమే కొనసాగుతాయి.
అమెరికా అణు రంగానికి రష్యా యురేనియం ఎంత ముఖ్యమో తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2025లో అమెరికా పౌర అణు విద్యుత్ రియాక్టర్ల నిర్వాహకులు కొనుగోలు చేసిన ఎన్‌రిచ్‌మెంట్ సేవల్లో రష్యా వాటా 26 శాతంగా ఉంది. అమెరికా వాటా 23 శాతం కాగా.. ఫ్రాన్స్ 18 శాతం, బ్రిటన్ 14 శాతం, నెదర్లాండ్స్ 8 శాతం అందించాయి.
అందుకే రష్యాతో అణు ఇంధన సంబంధాలను ఒక్కసారిగా తెంచుకోవడం అమెరికాకు అంత సులభం కాదు. ఒకవైపు రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచుతూనే.. మరోవైపు తమ అణు విద్యుత్ వ్యవస్థకు ఇంధన కొరత రాకుండా అమెరికా ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తోంది.ఇదే సమయంలో భారత్‌పై మాత్రం రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో ఒత్తిడి పెరుగుతోంది. కొత్త చట్టం కింద ట్రంప్ 100 శాతం వరకు టారిఫ్ విధించే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతానికి అలాంటి కొత్త 100 శాతం సుంకం భారత్‌పై విధించలేదు.

# జెన్-జీ ఆధ్యాత్మికత వైపు చూస్తోంది

## : మోహన్ భగవత్

**న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
ధర్మం అనేది కేవలం వృద్ధాప్యానికి పరిమితమైన అంశం కాదని, మనిషి పుట్టినప్పటి నుంచి చివరి వరకు అది మార్గనిర్దేశం చేస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించిన 'యువ ధర్మ సంసద్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.ప్రస్తుత కాలంలో యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొంటుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భగవద్గీత, రామాయణం వంటి పవిత్ర గ్రంథాలను కేవలం పదవీ విరమణ తర్వాత చదవాలని చాలామంది భావిస్తారని, అయితే ఆ అభిప్రాయం ఏమాత్రం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. జీవితంలోని ప్రతి అడుగు ధర్మానుసారమే సాగాలని సూచించారు.నేటి తరం యువత (జెన్-జీ) ధర్మం, ఆధ్యాత్మిక అంశాలు, భజనల పట్ల ఆసక్తి కనబరచడం సంతోషకరమని భగవత్ అన్నారు. "అన్నీ నేనే చేస్తున్నాను" అనే అహంకారం కేవలం భ్రమకే దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ధర్మాన్ని నిష్పక్షపాతంగా అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనసులో ఉన్న పాత అపోహలను, ముందస్తు అభిప్రాయాలను పక్కన పెట్టాలని కోరారు.తన ఆలోచనలను ఇతరులపై రుద్దడం తన ఉద్దేశం కాదని, ఈ జ్ఞానం సృష్టి ఆరంభం నుంచే ఉందని ఆయన వివరించారు. సృష్టి ఆది నుంచి అంతం వరకు ధర్మమే శాశ్వతమని, వ్యక్తిగత జీవితంలో పుట్టుక నుంచి మరణం వరకు సర్వ సుఖాలకు ధర్మమే మూలమని మోహన్ భగవత్ పునరుద్ఘాటించారు.

# కేసీఆర్ భూముల లెక్కలు విప్పి ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పొంగులేటి?

**హైదరాబాద్ సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి.. గులాబీ బాస్ కేసీఆర్ భూములపై సాగుతున్న చర్చను కొత్త దిశలోకి తీసుకెళ్లేలా చేశారు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కుటుంబానికి భారీ ఎత్తున భూములు ఉన్నాయంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. వెల్లడించిన వివరాలు సంచలనంగా మారిన వేళ.. దానికి కౌంటర్ గా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలిసిందే. అయితే.. కేటీఆర్ వ్యాఖ్యలకు కౌంటర్ అన్నట్లుగా పొంగులేటి తాజా వ్యాఖ్యలు ఉన్నాయి. 1954లోనే తమకు వందల ఎకరాల భూములు ఉన్నట్లుగా కేటీఆర్ చెప్పటం.. చింతమడకలో రెండు ఎకరాల్లో ఇల్లు ఉండేదన్న ఆయన.. ఎగువ మానేరులో కోల్పోయిన భూములకు వచ్చిన పరిహారంతోనే తమ తాత భూమి కొన్నారని చెప్పటం వరకు బాగానే ఉన్నా.. అలా అయితే 2004 వరకు ఒక్క ఎకరం భూమి కేసీఆర్ అండ్ కోకు



లేదంటూ పొంగులేటి చెప్పిన మాట ఇప్పుడు సంచలనంగా మారింది.తానేదో నోటికి వచ్చినట్లుగా వ్యాఖ్యలు చేయటం లేదని.. 2004లో జరిగిన కరీంనగర్ లోక్ సభ ఎన్నికల అఫిడవిట్ లో కేసీఆర్ తనకున్న భూముల వివరాల విషయానికి.. సున్నా భూములు అని పేర్కొన్నారు కదా? మరి.. దానికి ఏమంటారు? అన్నట్లుగా వేసిన ప్రశ్న ఇప్పుడు గులాబీ తోటను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న పరిస్థితి. అంతేకాదు.. సున్నా ఎకరాల నుంచి వందల ఎకరాల భూములు ఎలా సాధ్యమైంది? అన్న సూటిప్రశ్న ఇప్పుడు కొత్త ప్రశ్నలకు కారణమవుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన పదేళ్ల పాలనలో కేసీఆర్ భూములు భారీగా పెరిగాయని.. 2004 నాటి ఆయన ఎన్నికల అఫిడవిట్ ఆ విషయాన్ని స్పష్టం చేస్తుందన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన పొంగులేటి.. "పుట్టకతోనే కేసీఆర్ కు వందల ఎకరాలు ఉన్నాయని బొంకుతున్న కేటీఆర్.. 2004 ఎన్నికల అఫిడవిట్ లో వాటిని ఎందుకు చూపలేదు? అంటే.. ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారం ఇచ్చారా? ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.అంతేకాదు.. కేసీఆర్ కుటుంబానికి ఉన్న ఆస్తుల లెక్కలతో పాటు.. 2009 ఎన్నికల వేళ కేటీఆర్ ఎన్నికల అఫిడవిట్ లోని అంశాల్ని ప్రశ్నిస్తూ.. ఆయన్ను ఇరుకున పడేలా చేశారు పొంగులేటి. "కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో 24 మండలాల్లో.. 31 గ్రామాల్లో 440 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మొత్తం ఎలా వచ్చింది? ఎక్కడి నుంచి వచ్చింది? ఇదే విషయాన్ని సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రశ్నించారు. కేటీఆర్.. ఆయన భార్య.. పిల్లల పేరుతో ఎర్రవల్లి.. జన్వాడ.. మర్కూక్.. వెంకటాపూర్ పరిధిలో 123.19 ఎకరాలు ఉంది. 2009 ఎన్నికల వేళ కేటీఆర్ ఇచ్చిన అఫిడవిట్ లో రంగారెడ్డి జిల్లా శామీర్ పేట మండలం దేవరయాంజల్ సర్వే నంబరు 437లో ఎకరం వ్యవసాయ భూమి మాత్రమే ఉంది" అంటూ కేటీఆర్ లెక్కల్ని విప్పారు పొంగులేటి.

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీని

# స్కామ్‌గా మార్చారు

## : 'జెన్ జీ ఇంటరాక్షన్‌లో బుద్దా వెంకన్న



**విజయవాడ సెప్టెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త);**
విజయవాడలోని గాంధీజీ మహిళా కళాశాలలో నిర్వహించిన 'జెన్ జీ - ఇంటరాక్షన్' కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న పాల్గొని విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ, ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లపై విద్యార్థినులు అడిగిన పలు ప్రశ్నలకు, సందేహాలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, గ్రూప్స్ నియామకాలతో సహా ఉద్యోగాల భర్తీని ఒక స్కామ్‌లా మార్చేసి బ్యాక్ డోర్ పద్ధతిలో తమ అనుచరులకు ఉద్యోగాలు ఇచ్చుకున్నారని మండిపడ్డారు. ఈ అక్రమాల వల్ల లక్షలాది మంది ప్రతిభావంతులైన నిరుద్యోగులు నష్టపోయారని, కూటమి ప్రభుత్వం వీటన్నింటిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తుందని వెల్లడించారు. గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఏపీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని, భవిష్యత్తులో ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా అత్యంత పారదర్శకమైన, ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన వ్యవస్థను రూపుదిద్దుతున్నారని బుద్దా వెంకన్న తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా, అభ్యర్థులకు సరిపడా సమయం కల్పిస్తూ సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలో లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి రప్పించేందుకు లోకేశ్ కృషి చేస్తున్నారని కొనియాడారు.

# సుప్రీంకోర్టుకు వెళ్లను

## : దానం నాగేందర్ కీలక ప్రకటన



**హైదరాబాద్ సెప్టెంబర్ 18(జర్నలిస్ట్ వార్త);**
తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును తాను గౌరవిస్తున్నట్టు పేర్కొన్న ఆయన, మీడియా సమావేశంలో తన తదుపరి నిర్ణయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, "ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే అన్ని విషయాలు తేల్చుకుంటాం. నాకు ఎన్నికల్లో పోటీ చేయడం కొత్తేమీ కాదు. అనేక పోరాటాల ద్వారానే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మద్దతుతో పోరాడి విజయం సాధిస్తాను" అని ధీమా వ్యక్తం చేశారు. న్యాయపోరాటం కంటే రాజకీయంగానే దీనిని ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పరోక్షంగా సంకేతాలిచ్చారు.గతంలో స్పీకర్ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, నాగేందర్ మాత్రం తన పోరాటాన్ని ప్రజాక్షేత్రానికే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారు.